# మూడోకన్ను

ఎమ్మెస్సార్ మూర్తి



"పోస్ట్."

వినబడగానే బయటి కొచ్చాను.

"రిజిస్టర్డ్ లెటు రమ్మా!" అంటూ అల్లంత దూరాన్నుంచే చూపించాడు.

చిన్న చాటంత కవరు!

"ఎక్కణ్ణుంచో చూడండి. వారు లేరు." అన్నాను.

ముఖం చిట్లించి వినబోతున్నాను.

"శ్రీకంఠప్రసాద్

నేషనల్ కెమికల్ లాబొరేటరీ,

పూనా" అంటూ చదివాడు.

అంతే!

ఆ కనిపించే ఆకాశంలో పాతికేళ్ళ క్రిందటి రసాయనాలు! నేనూ, శ్రీకంఠ కూడబలుక్కున్న నిశ్శబ్దాలు, నవ్వుల పావురాళ్ళు, కళ్ళు తప్ప ఒళ్ళంతా మర్చిపోయి వ్రాసుకుని చదువుకున్న ప్రేమచిగుళ్ళ ఉత్తరాలు!

"కాస్సిని మంచి నీళ్ళిస్తారా?", అడిగాడు పోస్ట్‌మన్, సైకిలుకి స్టాండు వేసుకుంటూ.

అమ్మయ్య! ఆలోచించుకోవడానికి అవకాశం ఇచ్చాడు.

మంచినీళ్ళ గ్లాను అందిస్తూ అనుకున్నాను శ్రీకంఠ ఆ విషాన్నంత ఇవుడు కక్కడం లేదు గదా! ఆ కవర్లో నే వ్రాసిన ఉత్తరాల కట్ట లేదు గదా!

యౌవ్వనంపు పున్నమి లాటి వెన్నెల ఎగిరిపోగా, జీవితపు గానుగలో పడి కూడా ఆర్ద్రత అనే అపురూప వరాన్ని కోల్పోని ఒక గృహిణి...
ఆనాటి కలల యువరాజు నే డీ తల్లిని - 'నాకు నీ బిడ్డ నివ్వు' అని యాచించినప్పుడు...
"వారికి కళ్ళు పోయాయి... అయినా ఆ చీకట్లో వారికి నువ్వే కనిపిస్తున్నావు" అని చెప్పిన ఆయన నేమని పిలవాలి!
"మీరు పురుషోత్తములు" అంది ఆమె!
అల్పాక్షరముల అనల్పార్థములు చెప్పిన ఒప్పులకుప్ప ఈ ప్రేమ కథ!

ఆ సైకిల్ కారేజిని ఎప్పుడు పట్టుకున్నానో "అవి నా కిచ్చేయ్" అన్నాను.

"ఒక్కటేనండీ- దానికేం తీసుకోండి" అంటూ ముందు నా చేతికి గ్లాను ఇచ్చి, కవరు ఇచ్చి సంతకం పెట్టమన్నాడు.

ఆ కంగారులో ఖాళీ గ్లాను కింద పడింది.

కవరు పడకుండా ఎడమ మోచేతి కింద నొక్కిపట్టి సంతకం చేశా నెలాగో.

ఆ పాటికే కింద గ్లానుని తీసి అత నందిస్తుంటే "థాంక్స్" అంటూ లోపలి కొచ్చేశాను.

నేత చీర పమిట చెంగు కింద భద్రంగా దాచుకుంటూ వస్తుంటే అప్పటి వోణీలు... ఆ వోణీల మాటున దాచుకుంటూ తెచ్చుకుంటున్న మాటలేమిటో నన్నుగుబుళ్ళు గుర్తుకొచ్చాయి. గదిలోకి వెళ్ళాను.

ఏడుపు... భయం... వణుకు... బాధ.

మంచంకోడు మోకాలికి కొట్టుకుంది. నొప్పి పెడితే పెట్టింది- తలుపుకి బోల్టు పెట్టలేదని గుర్తొచ్చింది.

భద్రంగా తలుపు గడియ పెట్టాను.

కవరు మీది అడ్రను మళ్ళీ చదివాను.

ఎలా కనుక్కున్నాడో ననుకుంటూ వణుకుతున్న చేతుల్తో చించాను.

ఆ కాగితాలన్నీ చాలావరకు ఇంగ్లీమ టైపులో ఉన్న ఏవో ఫారాలు.

ఓ ఉత్తరం-

ఎప్పుడు కూర్చున్నానో మంచంమీద దిండు లాక్కుని గోడ కానుకున్నాను.

"శ్రీ గంగాధర్ గారికి...

నా పేరు దేవసేన. శ్రీకంఠ ప్రసాద్ గారి భార్యను. ఇటీవల లేబొరేటరీలోని ప్రమాదంలో మా వారి ముఖానికి ప్రమాదం జరిగింది. కళ్ళకి... అంటే చూపు రాకపోవచ్చు. అందుచేత ఇక ఉద్యోగం కూడా చేయలేరు. కంపాష్‌నేట్ గ్రౌండ్స్ అంటే సానుభూతిపరంగా పిల్లల కెవరికైనా ఉద్యోగం ఇస్తా మన్నారు. మాకు పిల్లలు లేరు. ఎలా వ్రాయాలో తెలియడం లేదు. మీ పిల్లల్లో ఎవరినైనా దత్తత తీసుకుంటానని అంటున్నారు. మీ కిష్టమైతే దీనిలో ఫారా లున్నాయి.

అలా కాకపోయినా మీ రందరూ ఓసారి రండి. మీ కెంతమంది అమ్మాయిలో, అబ్బాయి లెందరో తెలీదు. అమ్మాయి అయినా ఫరవాలేదు. ఉద్యోగాలు అంతగా దొరకని ఈ రోజుల్లో కనీసం ఇంటర్ లేదా టెన్త్‌తో ఈ అవకాశం తీసుకోవడం మంచిది కదా!

మీరు ఒప్పుకుంటే బహుశా వారి కో మూడోకన్ను ఇచ్చినవా రవుతారు.

మీ పిల్లలకు ఆశీస్సులు. మీ శ్రీమతి గార్కి నమస్కారములు. మిమ్మల్ని అందరినీ చూడాలని ఉంది. ఇవి చేరినట్లు వెంటనే ఉత్తరం వ్రాయండి.

ఇట్లు
నమస్కారములతో
ఎస్. దేవసేన."

పైటచెంగుతో ఎటో చూస్తూ ముఖం తుడుచుకున్నాను- గట్టిగా రుద్దుతూ.

నే విడిచిన నిట్టూర్పుకి తలుపు బోల్టు దానంతటదే జారింది.

రెక్కలు రెండూ తెరచుకున్నాయి.

హొరున గాలి.

నా కన్నీళ్ళ తెర వెనుక కనిపిస్తున్న ఆకాశం అలాగే...

అప్పటిలాగే ఉంది.

★ ★ ★

నాన్న పూనాలోని తెలుగు స్కూల్లో టీచరు. శ్రీకంఠ వాళ్ళ నాన్నేమో ఏదో సినిమా కంపెనీలో తబలిస్టు. మా స్కూలు ప్రోగ్రామ్స్‌కన్నిటికీ తన తోటి వాళ్ళందరితో వచ్చి ఆర్కెస్ట్రా సహాయం ఇచ్చి ఏమీ తీసుకోకుండా ఆనందంతో వెళ్ళేవాడు. శ్రీకంఠకి కూడా డోలక్ వచ్చు. అలా వారి కుటుంబానికీ, మాకూ స్నేహం. అప్పుడప్పుడూ వెళ్ళిరావడం. మాది శుక్రవార్‌పేట.

నేనూ, శ్రీకంఠ కలుసుకునేది బోట్స్ క్లబ్ రోడ్‌లోని నారంగీబాగ్.

రజనీష్ ఆశ్రమానికి విదేశీ భక్తులు వస్తుండే రోజు లవి. వాళ్ళూ, వాళ్ళ పిల్లలూ దారితప్పిన గంధర్వుల్లా కాషాయాల్లో "హాహా హూహూ" అంటూ తుళ్ళుతూ నవ్వుకుంటూ అప్పుడప్పుడే ఆ ప్రాంతంలో కడుతున్న ఫ్లాట్స్ కట్టినంతవరకే వెంటనే చేరిపోతుండేవారు. నేను, శ్రీకంఠ ఆ ప్రాంతాల్లో తిరుగుతూ కబుర్లు చెప్పుకుంటుంటే ఎవరూ పట్టించుకునే వాళ్ళు కాదు.

ఓ రోజు ఓ ఫారినావిడ తన పిల్లాడిని అంత స్వతంత్రంగానూ మెడమీద ఎక్కించుకుని ఆ బుల్లి బుల్లి మీగాళ్ళని జాగ్రత్తగా తన గుప్పెళ్ళతో పట్టుకుని వెళ్తుంటే మమల్నిద్దరి 2 చూసి వా డెందుకో నవ్వాడట. "దే ఆర్ బర్డ్స్... డోన్ట్ లాఫ్" అందట ఆవిడ.

"యూ మీన్ ఎర్లీ బర్డ్స్" అన్నాట్ట. ఆవిడ పకపకా నవ్వుతూ మమ్మల్నిద్దర్నీ పిలిచి మావాడు మీ మీద ఇలా జోకు వేశాడని చెప్పి మురిసిపోతే- "మే మిద్దరం వాణ్ణి కాసేపు ఎత్తుకుంటాం దించండి" అంటూ మారాం చేశాం.


కానీ వాడేమో ఒప్పుకోలేదు. వెక్కిరించాడు నవ్వుతూనే.

ఆనాటి రోజు లింకా ఇలా గుర్తొస్తా యనుకోలేదు.

ఆ తర్వాత నా పెళ్ళి!

ప్రేమించుకున్నట్టు తెలిస్తే చాలు! వెంటనే ఆ ప్రేమకి క్లోరోఫాం ఇచ్చి కంప్లీట్ బెడ్‌రెస్ట్ ఇచ్చి, మళ్ళీ వాంతు లయ్యేదాకా ఎదురుగా కూర్చుంటారు!

అలా అలా... మళ్ళీ ఆంధ్రా వచ్చి వార పత్రికలు చదువులా ఆవకాయ పచ్చళ్ళు పెడుతూ, అల్లికలూ, కుట్లూ నేర్చుకుంటూ,



మొలకొలుకుల్లోని మట్టిగడ్డల్ని ఏరుకుంటూ-

మరాఠీ భాష మర్చిపోయి, అరవ యాసలో తెలుగు మాట్లాడుతూ నెల్లూరు రామ్మూర్తి నగర్‌లో ఇల్లు కట్టుకుని...

ముగ్గురాడ పిల్లల్ని కని... జడలు వెయ్యడం పూనా జ్ఞాపకాలకి కనీసం పండగకైనా పసుపు రాయాలనుకోవడం-

మళ్లీ మామూలు తలంట్లు... లోపలికొచ్చే తలంట్లు వాళ్ళ పెళ్ళిళ్ళ క్కావలసిన బంగారాలు కొనడం- కట్నాలకి చిటీలు కట్టుకోవడం-

అప్పటి ఆ నా వలపు వసికాళ్ళు అలా అలా వడిలి వగిలిపోయాయి.

- కల్పన బియెస్సీ అయి టైపు నేర్చుకుంటూ మళ్ళీ మరోసారి ఎంయామ్‌సెట్ వ్రాస్తా నంటోంది!

- వందన థర్డ్ ఇయర్ బియ్యే చదువుతూ అవేవో అయ్యేయెస్ పరీక్ష లంటోంది- అయ్యేనా, పొయ్యేనా!

- అర్చన ఇంటర్ చదువుతోంది గానీ-

"నూనశరుని బారి కోర్వ లేరా!" అంటూ వసంత రాగంలో ప్రాక్టీసు చేస్తున్న వర్ణం దానికి మరీ బాగున్నట్టుందని నా కనిపిస్తూ- అదేమిటోగా ఉంది.

నాలుగయినట్టుంది.

పిల్లలు ఒక్కొక్కరే వచ్చారు.

వారు బి.యిడి. కాలేజీలో లెక్చరర్. అది ముగిశాక పార్ట్-టైం ట్యుటోరియల్ కాలేజీలో పని చేసి తొమ్మిదింటికి గానీ రారు.

"ఏమిటో నీరసంగా ఉంది నాన్నా... ఈవాల్టికి వంట మీరే చెయ్యండి" అని పిల్లల్ని పురమాయించాను.

కాసేపయ్యాక లేచి కాస్తంత ధైర్యం తెచ్చుకుని వేణ్ణీళ్ళతో స్నానం చేసి బాగా ముస్తాబయ్యాను.

కల్పన నన్ను ఎగాదిగా చూసి "ఏవిటే ఈ రోజింత లవ్లీగా ఉన్నావ్రా..." అంటూ ఊరుకోకుండా చెల్లెళ్ళను కేకేసి పిలుస్తుంటే సిగ్గుపడిపోయాను.

కల్పనని ఒళ్ళోకి లాక్కుని ముద్దెట్టుకున్నాను.

"ఎందుకే... ఇవుడివన్నీ..." అంది గారంగా, సిగ్గుగా.

"నీకు పెళ్ళయిం తర్వాత మాకు అన్నం పెడతవనీ..." అన్నాను.

"నువ్విలా చేస్తే నే నేడుస్తా..." అంటూ జారుకుంది.

★ ★ ★

పడుకోబోయే ముందు భగవద్గీతలో ఓ అధ్యాయం చదవడం వారికి అలవాటు.

అవును మరి. పిల్లలకి ఉద్యోగాలు వచ్చి మంచి సంబంధాలు రావాలి గదా!

ఆ రిజిస్టర్ కవరు భగవద్గీతలో పెట్టి అలాగే ఇచ్చేశాను. చదివినట్టున్నారు.

అందరికీ అర్థమయ్యేది వారికి అర్థమవుతుందని తెలుసు.

"నువ్వు ఎప్పుడూ చెప్పనేలేదు..."

నేను మాట్లాడలేదు.

"మనం... వాళ్ళని ఒక్కసారైనా చూళ్ళేదు.

మౌనంగా ఉన్నాను.

"నువ్వు కూడా ఓ ఉత్తరమైనా వ్రాసినట్టు లే దెప్పుడూ..."

నేను రాస్తే- అది మీకు తెలిస్తే- అన్న భయం నాకు ఉందని నే నెలా విప్పి చెప్పడం.

మౌనం.

వారి మౌనం నా మనసుకి పెడుతున్న సాన!

పరమ వాగుడు పిట్టనైన నేనిలా పని గట్టుకుని మాట్లాడలేకపోతున్నానంటే...

సిట్టూర్చాను.

"చెప్పు... మీ రిద్దరూ... చిన్నప్పుడు ప్రేమించుకున్నారాఏం.." చాలా నెమ్మదిగా, లాలనగా అడిగారు.

నేను భోళ్ళున ఏడవలేదు గాని కళ్ళలో వారికున్న ఆ లాలన పట్ల కృతజ్ఞతగా నీ ళ్ళొచ్చాయి.

"ఏం చేద్దామో చెప్పు- నీ ఇష్టం" అన్నారు.

నా కెంతో ధైర్యం వచ్చింది. "పెద్దదాన్ని తీసుకెళ్దాం. దానికి ఉద్యోగం వస్తే కొంత భారం తగ్గినట్టే!"

కాసేపు ఆలోచించారు.

నా వైపు చూస్తూ అన్నారు - "ఆడపిల్లలు... ప్రేమ కలల్ని ఎత్తుకుని ముద్దాడే రోజుల్లో తల్లిదండ్రుల్ని మర్చిపోతారు. భర్తలు వచ్చాక ఆ ప్రేమ భారాల్ని మర్చిపోతారు. పిల్లలు పుట్టాక భర్తల్ని... అల్లుళ్ళొచ్చాక కూతుళ్ళనీ మర్చిపోతారు. అలా పోతూ పోతూ అందర్నీ తమతో లాక్కుపోతూంటారు."

## నా కెందుకు?

"డాక్టర్ గారూ! మీ రిచ్చిన మందు బాగానే పని చేస్తుందండీ! ఇప్పుడు నేను ఎదుటి మనిషిని సరిగ్గా గుర్తించగలుగుతున్నానండీ!"

"సరేగానీ, ఆ విషయం నేరుగా వెళ్ళి డాక్టరుగారికి చెప్పండి. కాంపౌండర్ని నా కెందుకూ చెప్పడం?"

ఎం. శ్రీకర్ [నిజామాబాద్]



## నచ్చనిది

"అయ్యొయ్యో! బాబిగారు నా చీర చింపేశాడే కమలా!"

"వా. డంతేలే పిన్నీ! నచ్చం దేదైనా సరే చించిపారేస్తుంటాడు!"

పిన్ని [పొన్నూరు]

"అంటే..." అన్నాను.

"ఈ ఉత్తరం చూసి నీకు నీ కూతురు ఉద్యోగం- ఆ తర్వాత పెళ్ళీ కనిపిస్తున్నాయి-కదూ!"

నా కింకా అర్థం కాలేదు. అలాగే చూశాను.

"శ్రీకంఠ ప్రసాద్ గారి కళ్ళు పోయాయి. వారి కింకేమీ కనిపించదు. అయినా ఆ చీకట్లో వారికి నువ్వే కనిపిస్తున్నావు. అది నీకు కనిపించడం లేదా?"

నాకు పొడుపొచ్చింది. అది తట్టుకోలేక ఆయన గుండెల మీద పడి ఏడుస్తున్నాను.

"అదీ...! అలా బాధపడు- అర్థం ఉంది. ఊరట కలుగుతుంది" అన్నారు వీపు మీద చెయివేసి నిమురుతూ.

నేను చటుక్కున లేచి అన్నాను. "నాకు ఏడుపొచ్చింది అందుక్కాదు."

"మరెందుకు?"

"మీ రిక్కడ నుంచే శ్రీకంఠని చూసినందుకు."

మళ్ళీ ఏడుపు ఆగక ఏడుస్తూనే - "అతనికి లాగే మీకూ మూడో కన్ను ఉన్నందుకు..."

వీపుమీద చెయి వేస్తూ జడను అవతలకి జరుపుతూ అన్నారు "పిచ్చి పిల్ల! మగవాళ్ళకి ఎన్ని కళ్ళుంటే ఏం లాభం?!"

"అంటే?"

"శివుడిలో నగం శరీరం శివానీదే కదా!"

ఏడ్చాను. "మీరు పురుషోత్తములు" అంటూ వారి మీద పొర్లి పొర్లి ఏడ్చాను.

నా ఉద్వేగం కాస్తంత తగ్గాక అన్నారు- "భగవద్గీత అందుకో... నే నో అధ్యాయం చదువుకోవద్దూ?"

"వద్దు!"

"ఓ శ్లోకమైనా..."

"అలాగే- నే నిలాగే ఉంటాను. చదువుకోండి" అంటూ కౌగలించుకున్నాను.

"వాసాంసి జీర్ణాని యథావిహాయ
నవాని గృహ్ణాతి నరోపరాణి.

లాలి పాడుతున్నట్టే ఉంది.

దాని భావం ఊరట ఇస్తున్నట్టే ఉంది.

బట్టలు మార్చుకున్నట్టే ఆత్మ శరీరాల్లో మారుతుంటుంది. కానీ అందరిలో ఉంటూనే అది మారదు.

చటుక్కున ఆయన గుండె మీద నుండి ముఖం తీశాను. ఆ సాయంత్రం నుండీ ఇదెలా అవుతుందోనన్న ఉద్వేగంలో ముస్తాబైన ఆ నా కొత్తచీర గుచ్చుకుంటోంది.

దేవుడిలాంటి వారి కింకా దగ్గ రవ్వాలన్న ఆత్రంలో అప్పటికప్పుడే... అవన్నీ విప్పి... కుప్పపోసి..

పసిపిల్లలా... అప్పుడప్పుడూ ఆయన పిల్లని అంటుండే మర్కట కిశోరంలా...

దుప్పట్లో దూరి గట్టిగా కావిలించుకుని ముద్దెట్టుకుంటుంటే...

"కోతిపిల్ల..." అంటూ నవ్వారు

కదా...

ఇక అలా...